క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కలశాల ఊరేగింపు



కలశాలతో బసవేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: కర్ణాటకలోని పావగడ తాలుకాలోని దొమ్మతమర్రి గ్రామం నుంచి ఆదివారం సాయంత్రం గురుకరిబసవేశ్వరస్వామి విగ్రహంతో పాటు 101 కలశాలను ఊరేగింపుగా మడకశిర మండలం ఆమిదాలగొందికి తీసుకెళ్లారు. ఆ గ్రామంలోని గురుకరిబసవేశ్వరస్వామి ఆలయం వద్ద 101 కలశాలు, స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కరిబసవేశ్వరస్వామి విగ్రహాన్ని ఆలయానికి అందించారు.

రజక సంఘం నూతన కమిటీ ఎంపిక



మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

సోమందేపల్లి: రజక సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణను, ప్రధాన కార్యదర్శిగా తిమ్మయ్యను, ఉపాధ్యక్షులుగా రంగనాథం, శివయ్య, మారుతి, జయరాములుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ రజకులను ఎస్సీలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివప్ప, శ్రీరాములు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుని పోస్టు (వృక్షశాస్త్రం) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సుమన్న నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత అయిన వారు ఈనెల 29 లోపు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రీడాకారులు

పరిగి: అనంతపురం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో 10వ అనంతపురం ఫుట్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్ 13, 15, 17, 18 విభాగాల్లో బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ ఏఎఫ్ఎల్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం పరిగి సౌత్ జట్టుతో సోమందేపల్లి జట్టు తలపడింది. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నాగభూషణ, నరసింహమూర్తి, హరీష్, సునీల్, విష్ణు, హేమంత్, సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్‌చర్చిలో ఆదివారం సాయంత్రం క్రైస్తవ సోదరులు బైబిల్ మిషన్ సభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సెప్టెంబర్ 5, 6, 7 తేదీల్లో గుంటూరు పెదకాకానిలో బైబిల్ మిషన్ సభలు జరుగుతాయని పాస్టర్ సుధాకర్ తెలిపారు. రాయలసీమ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి

- వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే పేదలకు భరోసా
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మణూరులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమం పథకాలు మంజూరు చేస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తూ మళ్లీ ఆశీర్వదించి సీఎంగా చేసుకుంటామని లబ్ధిదారులు, మహిళలు తెలిపారు. మణూరు గ్రామ సచివాలయం పరిధిలోని ఉప్పిడిపల్లి, మణూరు గ్రామాల్లో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి పొందిన పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను అందించి మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే తమ కుటుంబానికి కొండంత భరోసా కల్పించాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ఉప్పిడిపల్లిలో బోరు వేయించి ఉప్పు నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో పలు వీధుల్లో సీసీ రోడ్లు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయం పరిధిలో పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మండలాధికారులకు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉప్పిడిపల్లి, మణూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తూ ప్రతి ఇంటికీ లబ్ధిని చేకూర్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత కలిస్తూ ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, సర్పంచ్ రామలింగమ్మ, ఎంపీటీసీ సునీత, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి మంజునాథ్, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, కురుబ సంఘం నాయకుడు హారేసముద్రం కరియన్న, వార్డు మెంబర్లు రామాంజినేయులు, నరసింహమూర్తి, డీలర్లు నాగరాజు, శంకర్, వివిధ కమిటీల నాయకులు ప్రభాకర్, శ్రీరామరెడ్డి, వెంకటేష్‌నాయక్, వెంకటనాయక్, రామనాయక్, శ్రీరామరెడ్డి, చౌడప్ప, నాగరాజు, రంగనాథ్, కార్యదర్శి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ఎమ్మెల్యే తిప్పేస్వామికి చోటు దక్కడంతో ఆదివారం ఉప్పిడిపల్లి, మణూరు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ వేంకటేశ్వ స్వామి ఆలయ పాలక మండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

అమరాపురం: ఎమ్మెల్యే తిప్పేస్వామిని టీటీడీ బోర్డు సభ్యునిగా నియమించడంతో అమరాపురం ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీ జయరామ్, నాయకులు అమరేష్‌బాబు తదితరులు ఆదివారం ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు.

నేడు నాయనిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక విచ్చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మండల, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

- మృతుడు అంతర్జాతీయ రెజ్లింగ్ క్రీడాకారుడు రమేష్ సోదరుడు



చంద్రశేఖర్ (ఫైల్)

పరిగి: అంతర్జాతీయ రెజ్లింగ్ క్రీడాకారుడు రమేష్ సోదరుడు, మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రశేఖర్ అలియాస్ చంద్రప్ప(43) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. అనంతపురం ఆస్పత్రి నుంచి శ్రీరంగరాజుపల్లికి చంద్రశేఖర్ మృతదేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మండల వైస్ ఎంపీపీ వేదవతి, ఆమె భర్త నరసింహారెడ్డి, వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, నాయకులు కిరణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మృతుడి సోదరులు రెజ్లింగ్ రమేష్, నారాయణస్వామిని పరామర్శించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ అధ్యక్షుడు రామకృష్ణ

హిందూపురం: సామాన్య ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని మూఢనమ్మకాలను విడనాడాలని జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి అన్నారు. స్థానిక ఆల్‌హిలాల స్కూల్‌లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు పి.రామకృష్ణ అధ్యక్షతన జోనల్ మహాసభ జరిగింది. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం దేశానికే గర్వకారణమన్నారు. ప్రస్తుతం దేశంలో సూడో సైన్సు రాజ్యమేలుతోందన్నారు. మారుతున్న ప్రపంచీకరణకు అనుగుణంగా నూతన శాస్త్రీయ విధానాన్ని అలవర్చుకుని అభివృద్ధి దిశగా ముందుకెళ్లాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జేవీవీ హిందూపురం జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి, సలహాదారుగా అడ్వకేట్ సిద్దూ, అధ్యక్షుడిగా పి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఈటీ రామ్మూర్తి, ఉపాధ్యక్షులుగా అతావుల్లా, ఉగ్రప్ప, అబ్దుల్‌హక్, ఓబులేసు, గంగిరెడ్డి, కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీపతి, ప్రభాకర్, మురళీమోహన్, నాగరాజుగుప్త, నరసింహులుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

'హనుమాన్ దర్శన్'ను సద్వినియోగం చేసుకోండి

లేపాక్షి: ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమాన్ దర్శన్‌ను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం ఆర్టీసీ డిపో మేనేజర్ హంపన్న, స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ ఆర్‌కే బాషా ఒక ప్రకటనలో తెలిపారు. కసాపురం, మురడి, నేమకల్లు గ్రామాల్లో ఆంజనేయ స్వామి దర్శనార్థం మంగళ, శనివారాల్లో హిందూపురం నుంచి బస్సులు నడుపుతున్నామన్నారు. ఒకరికి రాను, పోను చార్జీ పెద్దలకు రూ.710, పిల్లలకు రూ.380 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఓటరు దరఖాస్తుల పరిశీలన

హిందూపురం టౌన్: బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఓటరు జాబితా వివరాలను తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌ల వారీగా అందిన నూతన ఓటరు దరఖాస్తులను, పీఎస్‌ఈ ఫారంలను పరిశీలించారు.

శీతలాంబాదేవికి పూజలు



శీతలాంబాదేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక శనీశ్వరాలయంలో వైభవంగా శ్రావణ పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే శీతలాంబాదేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. కర్ణాటకతో పాటు ఏపీ నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున శనీశ్వరాలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

హిందూపురం అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యమని హిందూపురం అప్‌గ్రేడ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులు పేర్కొన్నారు. హిందూపురం పట్టణ టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఆయన అప్‌గ్రేడ్ స్టేషన్‌కు వచ్చారు. ఆదివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు.

పావగడ: పట్టణ సీఐగా సురేష్ , రూరల్ సీఐగా గిరీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు సిబ్బంది, పుర ప్రముఖులు వారికి స్వాగతం పలికారు.

శుభకార్యం

పెనుకొండ: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ నాగరత్న, ఆమె భర్త రేపటి గణేష్... పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో నిర్మించుకున్న ఇంటికి వెళ్లి పూజా కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్‌చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నాయకులు కొండలరాయుడు, ఫరీద్, బోయబాబు, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

కరుణించు వరుణదేవా..



రొళ్ల : దొడ్డేరిలో వర్షం కోసం బొడ్రాయిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామంలో ఆదివారం సాయంత్రం వరుణ దేవుని కరుణ కోసం మట్టి బొడ్రాయిని తలపై మోసుకుని గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. నెల రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటలు ఎండు ముఖం పట్టాయి. దీంతో వరుణ దేవుని కరుణ కోసం చెరువులోని మట్టిని తీసి బొడ్రాయిగా తయారు చేసుకుని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నీళ్లతో అభిషేకించి పూజలు చేయించారు. తర్వాత గ్రామం నడిబొడ్డున గల పురాతన బొడ్రాయికి 101 బిందెలతో నీటిలో అభిషేకించి వర్షం కురవాలని ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని కుంటలో మట్టి బొడ్రాయిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రసాదాన్ని తయారు చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి కోరారు. తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు స్పందన కార్యక్రమానికి విధిగా హాజరు కావాలన్నారు.

ఐచర్ వాహనం బోల్తా



మడకశిరరూరల్: మండల పరిధిలోని యూ రంగాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఐచర్ వాహనం రోడ్డుపై బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఐచర్ కర్ణాటక రాష్ట్రం నుంచి మడకశిర వైపు వస్తుండగా ఈ సంఘటన జరిగింది.

'దేశాన్ని కాపాడండి'

పెనుకొండ: దేశాన్ని కాపాడాలన్న నినాదంతో బస్సు యాత్ర చేపట్టడం జరిగిందని, సెప్టెంబర్ 8 వరకూ యాత్ర కొనసాగుతుందని సీపీఐ నాయకులు శ్రీరాములు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలో ఆదివారం సీపీఐ నాయకులు విడుదల చేశారు. నాయకులు వెంకటరాముడు, కిష్టప్ప, వెంకటేసులు, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు



అమరాపురం/రొళ్ల: అమరాపురం మండల పరిధిలోని హేమావతిలో వెలసిన శ్రీ సిద్ధేశ్వరస్వామికి ఆదివారం భక్తులు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. శ్రావణ మాసం రెండో ఆదివారం సందర్భంగా అర్చకులు స్వామి వారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రొళ్ల మండల పరిధిలోని టీడీ పల్లి సమీపంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి కూడా శ్రావణ మాస పూజలు జరిగాయి.



సీ కొడిగేపల్లి చెరువులో గుంపుగా తిరుగుతున్న పక్షులు

మడకశిరరూరల్ : మండలంలోని సీ కొడిగేపల్లి చెరువులో సమీపంలోకి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయంలో పక్షులు (కొంగలు) గుంపులు, గుంపులుగా వచ్చి చేరుతున్నాయి. చేపలు, నీటిలోని పురుగులు ఆహారంగా తీసుకోవడానికి కొంగలు గుంపులుగా వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పక్షులన్నీ గుంపుగా రావడంతో ఈ ప్రాంతమంతా సందడిగా మారుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం తర్వాత మళ్లీ అవి కనిపించడం లేదని చెబుతున్నారు.

ట్రాక్టర్, జేసీబీ స్వాధీనం

రొద్దం: మండల పరిధిలోని ఆర్ కొట్టాల గ్రామ సమీపంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీని ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్ర సరిహద్దు నుంచి కర్ణాటక రాష్ట్రానికి అనుమతులు లేకుండా కుంటలో నుంచి ఎర్రమట్టిని తరలిస్తుండగా రెవెన్యూ అధికారుల సూచనల మేరకు అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్, జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.